

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.33 గం.
సహర్ : ఆదివారం ఉ : 4.56 గం.

పంట నష్టం రూ.78.54 లక్షలు

- సంగారెడ్డి జిల్లాలో 714 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక



కంగ్టిలో వర్షానికి నేలకొరిగిన జొన్న

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 22: సంగారెడ్డి జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు రూ.78.54 లక్షల విలువైన పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు లెక్క తేల్చారు. ఈ నెల 18, 19 తేదీల్లో కురిసిన అకాల వర్షాలకు నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్ల లోని ముప్పై గ్రామాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పంటల నష్టంపై జిల్లా వ్యవసాయశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే జరిపి నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ నివేదిక ప్రకారం కోతకు వచ్చిన జొన్న, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. 237 మంది రైతులకు చెందిన 180 ఎకరాల్లో జొన్న, 74 మంది రైతులకు సంబంధించి 479 ఎకరాల్లో మామిడి, 29 మంది రైతులకు చెందిన 48 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. ఇద్దరు రైతులకు చెందిన 4 ఎకరాల్లో బొప్పాయి, ఒక రైతుకు చెందిన 3 ఎకరాల్లో అరటి దెబ్బతిన్నది. మొత్తం 343 మంది రైతులకు సంబంధించిన 714 ఎకరాల్లో ఆయా పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయశాఖ గుర్తించింది.

ఆస్తి రాయించుకుని తల్లిదండ్రులను గెంటేసిన కొడుకు

- కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలో ఘటన
- లీగల్ సర్వీసెస్ కమిటీని ఆశ్రయించిన వృద్ధులు
- ఇంటి తాళాలు ఇప్పించిన న్యాయాధికారి

7లో

ఫార్మా ముసుగులో నిషేధిత డ్రగ్స్

మత్తుపదార్థాల ఉత్పత్తికి అడ్డాగా పారిశ్రామికవాడలు





కొడకంచిలో అధికారులు స్వాధీనం చేసుకున్న మత్తుపదార్థాలు(ఫైల్)

- అక్రమార్జనే లక్ష్యంగా చీకటి వ్యాపారం
- నాలుగేళ్లలో నాలుగుసార్లు డ్రగ్స్ తయారీ గుట్టురట్టు
- మూడు నెలల కిందట కొడకంచిలో.. తాజాగా బొల్లారంలో పట్టివేత

జిన్నారం, మార్చి 22: అక్రమార్జనే ధ్యేయంగా ఫార్మా తయారీ ముసుగులో కొందరు నిషేధిత డ్రగ్స్‌ను తయారు చేస్తున్నారు. ఈ మత్తుపదార్థాల తయారీకి నగర శివారైన సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మండలంలోని పారిశ్రామికవాడలు అడ్డాగా మారుతున్నాయి. నాలుగేళ్లలో మూడు పరిశ్రమల్లో అధికారులు దాడులు నిర్వహించగా నిషేధిత డ్రగ్స్ తయారీని గుర్తించారు. మూడు నెలల కిందట మండలంలోని కొడకంచి శివారులో ఓ డ్రగ్స్ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించి మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా బొల్లారంలో రూ.8.99 కోట్ల విలువైన 90.40 కేజీల మెటాఫిడ్రోన్‌ను స్వాధీనం చేసుకోవటంతో మరోమారు డ్రగ్స్ కలకలం రేపుతోంది.

మూతపడ్డ పరిశ్రమల్లో

నగర శివారు ప్రాంతమైన పటాన్‌చెరు నియోజకవర్గం రాష్ట్రంలోనే ఫార్మా పరిశ్రమలకు కేంద్రంగా ఉన్నది. ఏటా దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతి జరిగే ఫార్మా ఉత్పాదనలలో రాష్ట్రం వాటా సుమారు 35 శాతం కాగా ఎన్నో పేరెన్నిక గల పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. ఇందులో భారీ పరిశ్రమలు 200 వరకు ఉండగా.. చిన్న, మధ్య తరహావి 600 వరకు ఉంటాయి. వాటిలో చాలా వరకు నిర్వహణ, వ్యాపార తదితర కారణాలతో మూతపడ్డాయి. కాగా కొన్ని చోట్ల ఖాయిలా పడ్డ చిన్న పరిశ్రమలను మత్తు పదార్థాల తయారీకి అడ్డాగా మారుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమ ప్రారంభానికి అనుమతులు ఇచ్చే పీసీబీ, పరిశ్రమల శాఖ, డ్రగ్ కంట్రోల్ తదితర విభాగాలకు ఏ పరిశ్రమలు మూతపడ్డాయో కచ్చితమైన సమాచారం ఉండడం లేదు.

లీజుకు తీసుకుని..

కొంత మంది అక్రమార్కులు మూతపడిన పరిశ్రమలను రహస్యంగా లీజు లేదా కొనుగోలు జరిపి బయటకి పొక్కకుండా నార్కోటిక్ నిషేధిత మార్ఫిన్, ఆఫెంటామైన్, ఎఫిడ్రిన్, ఆసిటోలోఫామ్ తదితర ఉత్ప్రేరకాలను తయారు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొన్నిచోట్ల అనుమతి ఉన్న ఔషధ ఉత్పాదనలకు బదులు.. నిషేధిత డ్రగ్స్, వాటి ముడిసరుకులను తయారీ చేసే పరిశ్రమలున్నట్లుగా ప్రచారం ఉన్నది. సంపాదనే ధ్యేయంగా ఫార్మా రంగంలో అనుభం ఉన్నవారు, పరిశ్రమలలోని ల్యాబ్ టెక్నీషియన్లు, వివిధ వ్యాధుల నివారణకు మందులను తయారీ చేసే విభాగంలో అనుభవం ఉన్న వారు ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిసింది.

సిబ్బందికే అవగాహన కరువు

పారిశ్రామికవాడలలో ఓ పరిశ్రమలో జరిపే ఉత్పాదనపై మరో పరిశ్రమకుగానీ, అందులో పని చేసే సిబ్బందికి కూడా పూర్తి సమాచారం ఉండదు. ముఖ్యంగా రియాక్టర్ల వారీగా లీజు తీసుకోవటం, లేదా కొన్ని రోజుల పాటు ఉత్పాదనల కోసం ఒప్పందాలు జరిపి కేవలం రెండు మూడు నెలల వ్యవధిలోనే కోట్లాది రూపాయల విలువైన మత్తుపదార్థాలను ఉత్పత్తి చేస్తున్నారనే ప్రచారం ఉన్నది. గత నాలుగేళ్లలో బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం, గండిగూడెం, కొడకంచి ప్రాంతాల పరిశ్రమలలో నార్కోటిక్, డ్రగ్ కంట్రోల్ విభాగాల ఆధ్వర్యంలో నాలుగుసార్లు దాడులు జరిపి వందల కోట్ల విలువైన డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. అయితే తరచుగా పరిశ్రమలపై డ్రగ్ కంట్రోల్ అధికారుల నిఘా కొరవడడంతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పారిశ్రామికవాడలోని ఫార్మా కంపెనీలపై, వాటి ఉత్పత్తులపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రతీ పరిశ్రమపై ఆయా శాఖల అధికారుల నిరంతర నిఘాతో నిషేధిత డ్రగ్స్ తయారీని నివారించే అవకాశం ఉంది.



బొల్లారం పారిశ్రామికవాడ

వెంకట్రామారెడ్డికే బీఆర్ఎస్ టికెట్

- మెదక్ లోకసభ బరిలో మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ
- అధికారిగా ఉమ్మడి జిల్లాతో అనుబంధం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట మార్చి 22 : మెదక్ లోక్‌సభ బీఆర్ఎస్ టికెట్‌ను ఎవరికి కేటాయిస్తారన్న సస్పెన్స్‌కు తెరపడింది. ఆ పార్టీ ఎమ్మెల్సీ, వీఆర్ఎస్ తీసుకున్న కలెక్టర్ పి.వెంకట్రామారెడ్డికి ఎంపీ టికెట్‌ను ఖరారు చేస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించారు. అయితే, నెల క్రితమే వెంకట్రామారెడ్డి పేరు తెరపైకి వచ్చినప్పటికీ ఆ తర్వాత గజ్వేల్ నేత వంటేరు ప్రతాపరెడ్డినే ఖరారు చేసే అవకాశం ఉందనే ప్రచారం జరిగింది. తాజాగా కేసీఆర్ సైతం పోటీకి దిగే అవకాశాలున్నాయనే చర్చ కొనసాగింది. కానీ, వీటన్నింటికి ఫుల్‌స్టాప్ పెడుతూ అనూహ్యంగా మళ్లీ వెంకట్రామారెడ్డి వైపే మొగ్గు చూపించారు. శుక్రవారం ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో మెదక్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలతో కేసీఆర్ సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు.

జేసీగా, కలెక్టర్‌గా గుర్తింపు

గ్రూప్-1 అధికారిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన వెంకట్రామారెడ్డి ఆరేళ్ల పాటు ఆర్డీవోగా, ఆ తర్వాత డ్వామా పీడీగా బాధ్యతలు నిర్వర్తించారు. 2009లో ఉమ్మడి మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా, 2014లో జాయింట్ కలెక్టర్‌గా కొనసాగారు. కొత్త జిల్లాల ఆవిర్భావంతో 2016 నుంచి 2021 వరకు సిద్దిపేట తొలి కలెక్టర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. ఎన్నికల నేపథ్యంలో కొద్దిరోజులు మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ఇన్‌చార్జి కలెక్టర్‌గానూ విధులను నిర్వహించారు. సిరిసిల్ల కలెక్టర్‌గా 8 నెలలు ఉన్నారు. దాదాపు పదేళ్లపాటు ఉమ్మడి మెదక్ జిల్లాతో సంబంధం ఉంది.

రాజీనామా చేసి రాజకీయాల్లోకి..

సిద్దిపేట కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలోనే 2021లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. వెంటనే ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే మెదక్ పార్లమెంట్ పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి టికెట్ ఆశించారు. కానీ అప్పటి పరిణామాల దృష్ట్యా టికెట్ దక్కలేదు. ప్రస్తుతం మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిత్వం దక్కడం గమనార్హం.



వెంకట్రామారెడ్డి

ఆచితూచి అభ్యర్థిత్వం

బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటగా పేరున్న మెదక్ పార్లమెంట్‌కు సంబంధించి అభ్యర్థి ఎంపికలో బీఆర్ఎస్ అధినేత మల్లగుల్లాలు పడ్డారు. ఈ పార్లమెంటు పరిధిలో ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచారు. 2004 నుంచి ఇక్కడ బీఆర్ఎస్ గెలుస్తున్నది. ఇదే పార్లమెంటు పరిధిలో మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, మాజీ మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గం సిద్దిపేట ఉన్నాయి. వెంకట్రామారెడ్డి పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాలతో సంబంధాలు కలిగి ఉండడం కూడా పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకున్నది.

పెండింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి

మెదక్ పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికే బీజేపీ తమ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావును ప్రకటించింది. తాజాగా బీఆర్ఎస్ సైతం తమ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డిని బరిలోకి దింపింది. కాంగ్రెస్ మాత్రం అభ్యర్థిని ప్రకటించడంలో జాప్యం చేస్తున్నది. ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయడంతో కాంగ్రెస్ కూడా ఆ దిశగా యోచించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. అయితే నీలం మధు పేరును దాదాపు ఖరారు చేశారని అంటున్నప్పటికీ అధికారికంగా ప్రకటించకపోవడం సందేహాలకు తావిస్తున్నది. బీఆర్ఎస్‌లా కాంగ్రెస్ నిర్ణయం కూడా ఉండబోతుందా.. అనే ఊహాగానాలు సైతం లేకపోలేదు.

వెంకట్రామారెడ్డి ప్రొఫైల్

పేరు: పరిపాటి వెంకట్రామారెడ్డి
భార్య: ప్రణీత
కుమారుడు, కూతురు: భరద్వాజ్‌రెడ్డి, రుత్విక
తల్లిదండ్రులు: రాజిరెడ్డి, పుష్పలీల
నివాసం: తెల్లాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గం
అధికారిగా: 1996లో (గ్రూప్-1) ఆర్డీవోగా ఎంపిక

హోదాలు:
- బందరు, చిత్తూరు, తిరుపతి డివిజన్లకు ఆర్డీవో
- 2002-2004లో ఉమ్మడి మెదక్ జిల్లా డ్వామా పీడీ
- 2009లో ఉమ్మడి మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్
- 2014-2016 వరకు ఉమ్మడి మెదక్ జాయింట్ కలెక్టర్
- 2016 నుంచి 2021 వరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ (ఎన్నికల బదిలీల్లో మెదక్, సిరిసిల్ల, సంగారెడ్డి కలెక్టర్‌గా)
- 2021 నవంబరు 15న ఉద్యోగ విరమణ

రాజకీయ అరంగేట్రం:
- 2021 నవంబరులో బీఆర్ఎస్‌లో చేరి ఎమ్మెల్సీగా ఎంపిక

బిల్లులు రాక బేజారు

- మెదక్ జిల్లాల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకుల వెతలు
- ట్రెజరీలోనే మూలుగుతున్న బిల్లులు



అల్లాదుర్గంలో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

మెదక్, మార్చి 22 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి. ఐదారు నెలలుగా బిల్లులు రాక వంట దినుసులు, కూరగాయలు, నూనెల కొనుగోలుకు అప్పు చేయాల్సివస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం అప్పుచేయాల్సి వస్తోందని వాపోతున్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా 904 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో అక్షయపాత్ర సంస్థ ఆధ్వర్యంలో 330 పాఠశాలల్లో 32 వేల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మిగిలిన 574 స్కూళ్లలో 59,179 మంది విద్యార్థులకు 1,400 మంది కార్మికులు మధ్యాహ్న భోజనాన్ని వండి వడ్డిస్తున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం తరగతుల వారీగా నిర్ణయించిన విధంగా బిల్లులు చెల్లిస్తుంది. 1 నుంచి 8 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5.45 చెల్లిస్తుంది. 9, 10 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ. 8.17 ప్రభుత్వం చెల్లిస్తుంది. అదనంగా గుడ్డుకు రూ.5 చొప్పున ఇస్తున్నది. బియ్యం మాత్రం ప్రభుత్వమే సరఫరా చేస్తున్నది.

పెండింగ్‌లో వేతనాలు

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు (కుక్ కమ్ హెల్పర్లు) అక్టోబరు నెల నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. 1,400 మందికి రూ.3 కోట్ల 24వేలు వేతనాలు రావాల్సి ఉన్నది. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతీ నెల రూ.3వేల చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి వేతనాలు ఇస్తున్నాయి. ఇందులో కేంద్రం వాటా రూ. వెయ్యి అందుతున్నా.. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2 వేలు మాత్రం రావడంలేదని కార్మికులు చెబుతున్నారు. దీంతో పాటు ఆరు నెలలుగా గుడ్లకు సంబంధించిన రూ. 2.59 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. వంట సరుకులకు సంబంధించిన రూ.2.62కోట్లు, ఉదయం అల్పాహారం తయారీ ఖర్చులు రూ. 39.22 లక్షలు కార్మికులకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నది. నిరుపేద మహిళలు ఉపాధి కోసం మధ్యాహ్న భోజన కార్మికులుగా పని చేస్తున్నారని, ప్రభుత్వ నుంచి నిధులు నిలిచిపోవడంతో నిర్వహణ భారమవుతున్నదని కార్మికులు వాపోతున్నారు.

నిధులు త్వరలోనే విడుదలవుతాయి



మధ్యాహ్న భోజన కార్మికుల జీతభత్యాలకు సంబంధించిన నిధులు త్వరలోనే ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఇప్పటికే 9, 10 విద్యార్థుల వంట దినుసుల డబ్బులు రూ.1.16 కోట్లు సిద్ధంగా ఉన్నాయి. త్వరలోనే మిగతా బకాయిలు విడుదలవుతాయి.

-రాధాకిషన్, మెదక్ జిల్లా విద్యాధికారి



విలేకరులతో మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్

సరిహద్దుల్లో నిఘా పటిష్టం

- నగదు, మద్యం రవాణా కట్టడికి చర్యలు
- మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్

మెదక్ అర్బన్, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. మెదక్‌లోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నిర్వహణపై జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. అక్రమ నగదు, మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అంతర్‌జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టాలన్నారు. వాహనాల తనిఖీలను పెంచాలని, సరైన ధ్రువపత్రాలు లేకుండా నగదు తీసుకొని వెళ్తే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. గంజాయి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన కేసులను త్వరగా పరిష్కరించాలని, వాటిలో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వారెంట్లను అమలు చేయాలని ఆదేశించారు. 41 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చేటప్పుడు జామీను పత్రాలు తీసుకొని ఇవ్వాలన్నారు. 174 సీఆర్పీసీ కేసులను తక్షణమే పరిష్కరించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్పీ బాలస్వామి, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు రాజేశ్వర్, వెంకటరెడ్డి, సైబర్‌క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, ఏఆర్ డీఎస్పీ రంగనాయక్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పాత పట్టాల పేరిట ప్రభుత్వ భూమి స్వాహా

- రద్దు చేసిన పట్టాల పేరుతో దర్జాగా పాగా
- హెచ్ఎండీఏకు కేటాయించిన స్థలం కబ్జా
- కూల్చేసిన చోటే తిరిగి నిర్మాణాలు
- అమీన్‌పూర్ నర్రెగూడెంలో భూ భాగోతం



నర్రెగూడెంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మిస్తున్న గదులు

పటాన్‌చెరు, మార్చి 22: దశాబ్దాల క్రితం ప్రభుత్వం పేదలకు కేటాయించి.. ఆ తరువాత రద్దు చేసిన ఇళ్ల పట్టాలను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూమిని అక్రమార్కులు స్వాహా చేస్తున్నారు. ఈ వ్యవహారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నర్రెగూడెంలో జరుగుతున్నది. గ్రామంలోని 1,112 సర్వే నంబర్‌లో మూడు దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు స్థలాలను కేటాయించి పట్టాలను పంపిణీ చేశారు. కానీ, స్థలాలకు పొజిషన్ చూపించకపోవడంతో ఎవరూ ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకురాలేదు. దీంతో పేదలకు పట్టాలు మాత్రమే మిగిలాయి.. స్థలాలు దక్కలేదు.

అనంతరం కాంగ్రెస్ హయాంలో ఇదే సర్వే నంబర్‌లో జేఎన్ఎన్‌యూఆర్ఎం అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం భూములను కేటాయించారు. ఈమేరకు భూమిని హెచ్ఎండీఏకు బదిలీ చేశారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన చేయడంతో అపార్ట్‌మెంట్లలో ప్లాట్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. కానీ, ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఇంటిని కేటాయించలేదు. కాగా, జేఎన్‌యూఆర్ఎం అపార్ట్‌మెంట్లు నిర్మించగా మిగిలిన మూడెకరాలపై అక్రమార్కుల కన్నుపడింది. నర్రెగూడెం గ్రామానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధుల అండతో ఆ భూమిలో దర్జాగా లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయిస్తున్నారు. రాత్రికిరాత్రి రేకులతో గదులు నిర్మించి స్థలాలను చెరబడుతున్నారు. దొడ్డిదారిన మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు, కరెంటు మీటర్లు తీసుకుంటున్నారు. ఎప్పుడో రద్దు చేసిన పట్టాల జిరాక్స్‌లు చేజిక్కించుకుని ఆయా పట్టాల పేరిట స్థలాలు విక్రయిస్తున్నారు. కబ్జాల వ్యవహారంలో అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధుల హస్తం ఉందని ప్రచారం జరుగుతున్నది. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి కలిసికట్టుగా వాటాలేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వీరికి రెవెన్యూ సిబ్బంది కొమ్ముకాస్తున్నారన్న విమర్శలున్నాయి.

పట్టించుకోని హెచ్ఎండీఏ

అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం తనకు కేటాయించిన స్థలాన్ని రక్షించుకోవడంలో హెచ్ఎండీఏ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమి కబ్జా కావడంపై స్థానికుల ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు స్పందిస్తూ.. ఆ స్థలం తమ ఆధీనంలో లేదని.. తామేమీ చేయలేమని పేర్కొంటున్నారు. మరోవైపు హెచ్ఎండీఏ అధికారులు రికార్డుల్లో స్థలాన్ని చూసుకోవడమే తప్ప క్షేత్రస్థాయిలో పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కోట్లాది రూపాయల విలువైన భూమి అక్రమార్కుల పాలవుతున్నదని నర్రెగూడెం గ్రామస్థులు వాపోతున్నారు. గతంలో ఇచ్చిన పట్టాలపై దర్యాప్తు జరిపించి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

నర్రెగూడెం సర్వే నంబర్ 1,112 లో ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నదని ఫిర్యాదులు రావడంతో గతంలోనే చర్యలు తీసుకున్నాం. కబ్జాదారులకు నోటీసులు జారీ చేశాం. పలు అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం. పదేపదే కబ్జాలకు పాల్పడే వారిపై, కూల్చివేసిన కట్టడాలను తిరిగి నిర్మించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

-రాధ, తహసీల్దార్, అమీన్‌పూర్

ఆస్తిపన్ను వసూళ్లు సగమే!

- సంగారెడ్డిలో రూ.15.61 కోట్లకు.. రూ.7.55 కోట్లు వసూలు
- ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.3.91 కోట్లు
- నల్లా బిల్లుల బకాయిలు రూ.9.25 కోట్లు

సంగారెడ్డి టౌన్, మార్చి 22: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మున్సిపాలిటీ సిబ్బంది ఆస్తి పన్ను, నల్లా బిల్లుల వసూలు మందగించింది. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను 49 శాతం, నల్లా బిల్లులు బకాయిలు 8 శాతం మాత్రమే వసూలయ్యాయి. అయితే, 11 నెలలుగా వసూళ్లను పట్టించుకోని అధికారులు ఈ నెల నుంచి స్పెషల్‌డ్రైవ్ పేరిట వసూళ్లను వేగవంతం చేశారు. సంగారెడ్డి పట్టణంలో 38 వార్డుల పరిధిలో 21,397 నివాసాలు ఉన్నాయి. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 15.61 కోట్ల ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉంది. కానీ గత 11 నెలలుగా రూ. 7.55 కోట్లు మాత్రమే వసూలయింది. ఈ నెలాఖరు వరకు వంద శాతం వసూళ్లు చేయాలని రెవెన్యూ విభాగానికి మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. ఇందుకోసం 7 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఏడుగురు సిబ్బందిని నియమించారు. పట్టణంలో మొత్తం 137 ప్రభుత్వ కార్యాలయ భవనాల నుంచి రూ. 3.95 కోట్లు ఆస్తిపన్ను రావాల్సి ఉండగా.. ఇప్పటివరకు కేవలం రూ.4.31 లక్షలు చెల్లించారు. ఇంకా రూ. 3.91 కోట్లు బకాయిలు ఉన్నాయి.

నల్లా బిల్లుల వసూలు 8 శాతమే!

సంగారెడ్డి పట్టణంలో మొత్తం 11,406 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ప్రతీ కనెక్షన్‌కు నెలకు రూ.250 చొప్పున ప్రతీ ఏడాది రూ.17.10 లక్షలు ఆదాయం రావాల్సి ఉంటుంది. కానీ గత కొన్నేళ్లుగా బిల్లులు సక్రమంగా వసూలు చేయకపోవడంతో మున్సిపాలిటీకి రూ. 9.90 కోట్లు నల్లా బిల్లులు రావాల్సి ఉన్నది. కానీ మున్సిపల్ అధికారులు చేపట్టిన స్పెషల్‌డ్రైవ్‌లో రూ.68.71 లక్షలు వసూలు చేయగలిగారు. మున్సిపాలిటీకి ఇంకా రూ. 9.21 కోట్లు నల్లా బిల్లులు రావాల్సి ఉంది.

వడ్డీపై 90 శాతం మాఫీ

ఆస్తిపన్ను బకాయిలపై 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పేరుకుపోయిన బకాయిలను వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లించేందుకు వడ్డీపై 90 శాతం తగ్గింపు ప్రకటించింది. అయినా, ఈ నెల ముగియడానికి ఇంకా 8 రోజులే మిగిలి ఉండడంతో వంద శాతం లక్ష్యం చేరడం కష్టమే అన్న భావన ఉంది.

మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి

● ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారిణి సత్యశ్రీ

సంగారెడ్డి రూరల్, మార్చి 22: మాజీ సైనికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారిణి సత్యశ్రీ అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మాజీ సైనికుల సంక్షేమ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ సైనికులు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారి తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖను పూర్తి డిజిటలైజ్ చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని మాజీ సైనికుల డాటాను పూర్తిగా కంప్యూటరైజ్ చేసినట్లు తెలిపారు. మాజీ సైనికులకు లభించే రాయితీల కోసం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవడం ద్వారా సమయం, శ్రమ ఆదా అవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో దిగ్విజయ్, సరస్వతి, మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ అధికారులు ఎన్ఎస్.రావు, జితేంద్రా రావు, రాజ్‌మియన్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ సైనికులు పాల్గొన్నారు.

చాపకింద నీరులా క్షయ

నివారణకు చర్యలు శూన్యం

● అవగాహన కల్పించడంతో వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం
● సంగారెడ్డి జిల్లాలో 2వేలకు పైగా బాధితులు
● రేపు ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం

సంగారెడ్డి అర్బన్, మార్చి 22: వైద్యాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో పూర్తి స్థాయిలో క్షయ నివారణ జరగడం లేదు. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఈ వ్యాధి నివారణపై ఉన్నతాధికారుల పట్టింపులేక సంగారెడ్డి జిల్లాలో క్షయ నివారణ విభాగం అధికారులు, వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ కేంద్రాల్లో క్షయ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తున్నది.

దేశంలో క్షయ వ్యాధిని 2025నాటికి పూర్తిగా పారదోలాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ అధునాతన, ఖరీదైన యంత్ర పరికరాలను సమకూర్చింది.

క్షయ నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

సంగారెడ్డి జిల్లాలో క్షయ నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఎన్జీవోలు, పరిశ్రమల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించే ప్రయత్నం చేస్తున్నాం. జిల్లా క్షయ నివారణ కార్యాలయంతో పాటు ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ టీబీ చికిత్స యూనిట్‌లోనూ మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి గతంలోనే నివేదించాం. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. క్షయ రోగులకు పౌష్టికాహార నిమిత్తం నెలకు చెల్లించాల్సిన డబ్బులు బడ్జెట్ విడుదల కాకపోవడంతో ఆరు నెలలుగా జమ చేయలేకపోయాం. నిధులు విడుదల కాగానే జమ చేస్తాం.

- రాజేశ్వరి, జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్

ఎప్పటికప్పుడు రోగులకు సరిపడా మందులను పంపుతున్నది. కానీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వద్ద ఎలాంటి కార్యాచరణ లేదు. ఏడాదికొకసారి జిల్లా టీబీ ఫోరం సమావేశం, ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ, సమావేశంతోనే సరిపెడుతున్నారు. అవగాహన కార్యక్రమాలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.

క్షయ లక్షణాలు

● రెండు వారాలకు మించి దగ్గు రావడం.
● దగ్గుతున్నప్పుడు రక్తం పడడం.
● సాయంత్రం, రాత్రి వేళలో జ్వరం రావడం.
● ఆకలి లేకపోవడం, బరువు క్రమంగా తగ్గడం.

ఈ లక్షణాలు ఉన్నప్పుడు నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ప్రమాదం. దగ్గు రూపంలో ఒకరి నుంచి మరొకరికి సోకే ఈ వ్యాధి ప్రాణాలనే బలి తీసుకుంటుంది. జిల్లాలో ఏటా సుమారు 70మంది వరకు క్షయ వ్యాధితో చనిపోతున్నారంటే పరిస్థితి ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో క్షయ కేసుల పెరుగుదల ఇలా..

సంగారెడ్డి జిల్లాలో క్షయ కేసులు పెరగడం ఆందోళనకు గురిచేస్తున్నది. 2018లో 1,476 కేసులు, 2019లో 1,798 కేసులు, 2020లో 1,692 కేసులు, 2021లో 1,702 కేసులు, 2022లో 2,389 కేసులు, 2023లో 2,250 కేసులు, 2024(ఈ నెల 22వరకు)లో 374 క్షయ కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఏటా క్షయ బాధితుల సంఖ్య పెరగడం కలవరపెడుతున్నది. జిల్లాలో ఆరు చికిత్స యూనిట్లతో పాటు పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో క్షయ బాధితులను గుర్తిస్తున్నా కేసులు పెరగడం ఆందోళనకు గురిచేస్తున్నది.

ఆరు నెలలుగా నిలిచిన నగదు జమ

కేంద్ర సర్కారు నిక్షయ్ పోషన్ యోజన కింద పౌష్టికాహారం కోసం ప్రతీ నెల క్షయ రోగి ఖాతాలో రూ.500 జమ చేస్తుంది. ఇందుకు సంబంధించిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు విడుదలవుతాయి. వాటిని జిల్లా కలెక్టర్ అనుమతితో సంబంధిత రోగి ఖాతాలో నేరుగా జమ చేస్తారు. ఆరు నెలలుగా నిధులు జమ కావడం లేదు. నిధుల లేమి కారణంగా నగదు జమ నిలిచినట్లు అధికారులు తెలిపారు.



సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని జిల్లా క్షయ నివారణ కేంద్రం

అధికారుల నిర్లక్ష్యం.. రోగులకు శాపం

వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని ఉన్నతాధికారులు తరుచూ జిల్లా వైద్యాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచిస్తున్నా నిర్లక్ష్యం వహిస్తుండడంతో రోగుల పాలిట శాపంగా మారింది. సంగారెడ్డిలోని జిల్లా టీబీ కార్యాలయంలో నిత్యం టీబీ రోగులకు వైద్య సేవలందించాల్సిన మెడికల్ ఆఫీసర్ పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసరే కార్యాలయంలో ఉంటూ క్షయ రోగులకు సేవలందిస్తున్నారు. జిల్లా అంతటా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ క్షయ నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ఆ ప్రోగ్రాం ఆఫీసర్ సైతం కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తుండడంతో నివారణ ఎలా జరుగుతుందనే విమర్శలొస్తున్నాయి. వ్యాధి నివారణకు జిల్లా ప్రోగ్రాం అధికారితో పాటు క్షేత్ర స్థాయిలో పనిచేసే ఎస్‌టీఎస్, ఎస్‌టీఎల్ఎస్‌లకు ప్రభుత్వం వాహన సదుపాయం, రవాణా భత్యం కూడా చెల్లిస్తున్నప్పటికీ కొందరు జిల్లా కేంద్రానికే పరిమితమవుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సైతం క్షయ నివారణ విభాగంతో తరుచూ సమీక్షలు జరపడకపోవడం క్షయ వ్యాధి పెరుగుదలకు కారణం.

వివాహమైన 10 నెలలకే వివాహిత ఆత్మహత్య

● కుటుంబ కలహాలే కారణం?



భర్త మధుసూధన్‌రెడ్డితో కవితారెడ్డి(ఫైల్)

అల్వాల్, మార్చి 22: వివాహమైన 10 నెలలకే వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సికింద్రాబాద్‌లోని అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అల్వాల్ ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి కూతురు కవితారెడ్డి(28)ని 10 నెలల క్రితం సిద్దిపేట జిల్లా తొగుటకు చెందిన మధుసూధన్‌రెడ్డికి ఇచ్చి ఘనంగా వివాహం చేశారు. దంపతులిద్దరూ సికింద్రాబాద్‌లోని అల్వాల్ జొన్నబండలోని ఎంహెచ్ఆర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. మధుసూధన్‌రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, కవితా కిమ్స్ ఆస్పత్రిలో అడ్మిన్‌గా పనిచేస్తున్నారు. మధుసూధన్‌రెడ్డి తల్లి అనారోగ్యానికి గురవడంతో ఆమెకు తోడుగా ఉండేందుకు రెండురోజుల క్రితం తొగుటకు మధుసూధన్‌రెడ్డి వెళ్లాడు. అదే రోజు ఆస్పత్రిలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన కవితారెడ్డి భర్త లేకపోవడంతో కాలక్షేపం కోసం ఆమె ఇంటికి సమీపంలోనే ఉండే తన భర్త మధుసూధన్‌రెడ్డి సోదరి తాటిపర్తి కల్పనారెడ్డి ఇంటికి వెళ్లింది. అక్కడే భోజనం చేసి రాత్రి నిద్రించింది. శుక్రవారం ఉదయం 6-30గంటలకు నిద్ర లేచిన కవితారెడ్డి ఆఫీసుకు వెళ్లాలని కల్పనారెడ్డికి చెప్పి వారింటికి వెళ్లింది. ఉదయం 8-30 గంటలవుతున్నా కవితారెడ్డి తలుపులు తీయలేదు. అనుమానం వచ్చిన కల్పనారెడ్డి తన భర్తతో పాటు స్థానికుల సహాయంతో కిటికీ తెరిచి చూడగా కవితారెడ్డి ఫ్యాన్‌కు ఉరేసుకుని విగత జీవిగా కనిపించింది. అల్వాల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకి దించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాల కారణంగానే కవితారెడ్డి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తున్నది.

టిఫిన్ సెంటర్‌లో గంజాయి స్వాధీనం

● ఒకరిని అరెస్టు చేసిన ఎక్సైజ్ అధికారులు

నారాయణఖేడ్, మార్చి 22: టిఫిన్ సెంటర్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేసి 600 గ్రాముల ఎండుగంజాయిని పట్టుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం ర్యాలమడుగు తండా శివారులోని నిజాంపేట- ఖేడ్- బీదర్ జాతీయ రహదారి పక్కన భవానీ టిఫిన్ సెంటర్ ఉంది. అందులో గంజాయిని విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారం అందడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ అనిల్, సిబ్బందితో కలిసి గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఈ తనిఖీలో 600 గ్రాముల ఎండు గంజాయి పట్టుకున్నారు. దీని విలువ రూ.16 వేల వరకు ఉంటుందని చెప్పారు. గంజాయి విక్రయిస్తున్న ఎండి.మహ్మద్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రధాన నిందితుడైన టిఫిన్ సెంటర్ యజమాని జతీలాల్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వీణారెడ్డి శుక్రవారం వివరించారు.

బంధువుగా వచ్చి ఇంట్లో చోరీ

● రూ.40వేల నగదు, అరతులం బంగారం అపహరణ

శివ్వంపేట, మార్చి 22: ఇంటికి చుట్టపు చూపుగా వచ్చి, ఇంట్లో ఉన్న నగలు, నగదు అపహరించిన ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఎదుల్లాపూర్‌లో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదుల్లాపూర్‌కు చెందిన ఉప్పరి భిక్షపతి ఇంటికి చుట్టపు చూపుగా హత్నూర మండలం బోర్పట్లకు చెందిన మల్లేశ్ ఈ నెల 20న వెళ్లాడు. ఈ క్రమంలో మల్లేశ్‌ను ఇంట్లోనే ఉంచి భిక్షపతి తన భార్యతో కలిసి పనిమీద బయటకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన మల్లేశ్ ఆ ఇంట్లో భిక్షపతి తన కూతురు పెళ్లికి దాచిన రూ.40వేల నగదు, అర తులం కమ్మలతో పాటు సెల్‌ఫోన్ తీసుకుని ఉడాయించాడు. ఇంటికి వచ్చిన భిక్షపతి దంపతులు చోరీ జరిగినట్లు గుర్తించి, శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విరాళాలు సేకరించి, రోడ్డు నిర్మాణం

● తాత్కాలికంగా సమస్యను పరిష్కరించుకున్న కేసీఆర్ కాలనీవాసులు



మట్టి రోడ్డును ఏర్పాటు చేసుకున్న దృశ్యం

రామాయంపేట, మార్చి 22: మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రానికి సమీపంలో పది నెలల క్రితం బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కాలనీ పేరిట 295 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టి, పంపిణీ చేయగా సుమారు 800 మంది నివాసముంటున్నారు. కానీ కాలనీకి రోడ్డును నిర్మించలేదు. పది నెలలు కావస్తున్నా సరైన రోడ్డు మార్గమే లేకపోవడంతో బండరాళ్ల మీదుగా కాలనీవాసులు ప్రయాణాలు సాగిస్తున్నారు. సమస్యను మున్సిపాలిటీ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. ఈ నేపథ్యంలో శుక్రవారం కాలనీవాసులంతా తమలో తాము తోచినంత విరాళాల రూపంలో డబ్బులు సేకరించి మట్టి రోడ్డు నిర్మించుకున్నారు. దీంతో తాత్కాలికంగా కేసీఆర్ కాలనీ వాసులకు రోడ్డు సమస్యల తీరింది.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయండి



సంగారెడ్డిలో యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్, మార్చి 22: ప్రభుత్వ పాఠశాలలను పబ్లిక్ స్కూళ్లుగా ఎంపిక చేసి అభివృద్ధి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి 23వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్ది పేద విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యనందించేందుకు సంకల్పించారని చెప్పారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో ఉన్న జడ్పీ ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, అభివృద్ధి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శులు లసాయితేజ, సింహాచలం, నాయకులు విజయానంద్, నరేందర్, మనోహర్, మురార్జి, సంజీవయ్య పాల్గొన్నారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ అధికారులు

కొల్చారం, మార్చి 22: మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని ఓ గ్రామంలో బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. 15సంవత్సరాల వయసు గల బాలిక వివాహం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఐసీడీఎస్ డీసీపీవో కరుణశీల, సూపర్‌వైజర్ సంతోష, సిబ్బంది కొల్చారం పోలీసుల సహాయంతో వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికను మెదక్‌లోని సఖి కేంద్రానికి తరలించారు. బాలిక తల్లితండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఖాజీపూర్‌లో ముదిరాజ్‌ల సాంఘిక బహిష్కరణ

● చేపలు పట్టుకునే విషయమై గ్రామస్థులకు, ముదిరాజ్‌లకు మధ్య వివాదం
● 25ముదిరాజ్ కుటుంబాలను వెలేసిన గ్రామాభివృద్ధి కమిటీ
● నిత్యావసర సరుకులు ఇవ్వవద్దని హుకూం
● ఇచ్చిన వారికి రూ.50వేల జరిమానా అంటూ హెచ్చరిక
● విచారణ చేపట్టిన అధికారులు



ఖాజీపూర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

మిరుదొడ్డి/అక్బర్‌పేట-భూంపల్లి, మార్చి 22: గ్రామంలోని చెరువులో చేపలు పట్టుకునే విషయంలో గ్రామస్థులకు, ముదిరాజ్‌లకు వివాదం తలెత్తడంతో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ముదిరాజ్‌లను గ్రామ బహిష్కరణ చేశారు. దీంతో బాధితులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్లితే.. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలోని పెద్ద చెరువులో చేపలు పట్టుకునే విషయంలో గ్రామస్థులకు, ముదిరాజ్‌లకు మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తున్నది. చెరువుపై గ్రామాభివృద్ధి కమిటీకే హక్కు ఉన్నదని, ముదిరాజ్‌లకు హక్కు లేదంటూ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామంలోని 25ముదిరాజ్ కుటుంబాలను గురువారం సాంఘిక బహిష్కరణ చేశారు. గ్రామంలో నిత్యావసర సరుకులు అమ్మవద్దని, ఎవరైనా సరుకులు ఇచ్చినా.. సహకరించినా రూ.50వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీంతో బాధితులు శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ మను చౌదరికి ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఈ ఘటనపై విచారణ జరపాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సరోజ, మత్స్యశాఖ జిల్లా అధికారి మల్లేశంను ఆదేశించారు. వారు శుక్రవారం గ్రామాన్ని సందర్శించి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ముదిరాజ్‌లతో మాట్లాడారు. 1994లోనూ చేపలు పట్టే విషయమై సమస్య తలెత్తినప్పుడు గ్రామాభివృద్ధి కమిటీ వేసుకున్నామని, అప్పటి నుంచి పెద్ద చెరువుపై గ్రామాభివృద్ధి కమిటీకే హక్కు ఉన్నదని గ్రామస్థులు అధికారులకు చెప్పారు. ఇప్పుడు కొత్తగా తమకే హక్కు ఉన్నదంటూ ముదిరాజ్‌లు వివాదం సృష్టించారని చెప్పారు. అయితే సాంఘిక బహిష్కరణ నేరమని, వెంటనే బహిష్కరణను ఎత్తివేయాలని అధికారులు కమిటీ సభ్యులకు సూచించారు. పెద్ద చెరువు విషయమై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు. వారి వెంట డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి, తహసీల్దార్ జయంత్, ఎంపీడీవో గణేష్‌రెడ్డి, ప్రత్యేక అధికారి వీరేష్ ఉన్నారు.

ఆస్తి రాయించుకుని తల్లిదండ్రులను గెంటేసిన కొడుకు

● లీగల్ సర్వీసెస్ కమిటీని ఆశ్రయించిన వృద్ధులు
● ఇంటి తాళాలు ఇప్పించిన న్యాయాధికారి



నర్సాపూర్ కోర్టులో వృద్ధ దంపతులకు ఇంటి తాళాన్ని అందజేస్తున్న న్యాయాధికారిణి అనిత

నర్సాపూర్, మార్చి 22: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూడాల్సిన కుమారుడు ఆస్తులు రాయించుకుని ఇంటినుంచి గెంటేశాడు. వృద్ధ దంపతులు నర్సాపూర్ లీగల్ సర్వీసెస్ కమిటీని ఆశ్రయించి, ఇంటి తాళాలను తిరిగి పొందారు. మెదక్ జిల్లా నర్సాపూర్ డివిజన్ కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన గండి లచ్చయ్య, గండి తులసమ్మ దంపతులకు కుమారుడు మధుసుదన్‌గౌడ్ ఉన్నాడు. తల్లితండ్రుల పేరిట ఉన్న ఇంటిని వారికి తెలియకుండానే మధుసుదన్‌గౌడ్ తన పేర రాయించుకుని తల్లిదండ్రులను ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. రోడ్డుపాలైన వృద్ధ దంపతులు తాము ఉండేందుకు నీడ లేదన్న మనోవేదనతో శుక్రవారం నర్సాపూర్‌లోని లీగల్ సర్వీసెస్ కమిటీని ఆశ్రయించారు. వృద్ధ దంపతుల గోడును న్యాయాధికారిణి కె.అనిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించారు. ఇంటికి సంబంధించిన తాళాలను మధుసుదన్‌గౌడ్ నుంచి స్వాధీనం చేసుకుని వృద్ధ దంపతులకు తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా న్యాయాధికారిణి మాట్లాడుతూ.. కొడుకులు, కూతుళ్ల తల్లితండ్రుల ఆలనా పాలన చూడకుండా ఇబ్బందులకు గురిచేస్తే చట్ట ప్రకారం కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆస్తులు వారిని కాదని తీసుకుంటే స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్నారు. వృద్ధాప్యంలో కడుపునిండా భోజనం, కాస్త ప్రేమఆప్యాయతలు చూపితే ఎంతో సంబురపడతారని చెప్పారు. ఆమె వెంట న్యాయవాదులు ఎ.శ్రీనివాస్, మధుశ్రీ, స్వరూపారాణి, సూపరింటెండెంట్ పద్మావతి, లీగల్ సర్వీసెస్ సిబ్బంది ఉన్నారు.

పోచారంలో వన్య ప్రాణులకు రక్షణ కల్పించాలి

● చెక్‌పోస్టులలో తనిఖీలు నిర్వహించాలి
● మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



పోచారం గెస్ట్‌హౌజ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

హవేళీఘణపూర్, మార్చి 22: ప్రసిద్ధిగాంచిన మెదక్ జిల్లా హవేళీఘణపూర్ మండలం పోచారంలోని వన్యప్రాణులకు వేసవి దృష్ట్యా తాగు నీరు, ఆహారం సమకూర్చి వాటి సంరక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శుక్రవారం పోచారం గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును, పోచారం వన్యప్రాణుల సంరక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌పోస్టుల వద్ద పక్కాగా తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల్లో నగదు, బంగారం, ఇతర కానుకలను పంపిణీ చేసే అవకాశం ఉన్నందున తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలను పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో సర్వేలెన్స్, స్టాటికల్ అకౌంటింగ్, వ్యయపరిశీలక బృందాలు విస్తృతంగా సర్వేలు నిర్వహించాలని సూచించారు. సీజ్ చేసిన వస్తువులకు వివరాలతో కూడిన రశీదులు ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం పోచారం పార్కులోని వన విజ్ఞాన కేంద్రాన్ని, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అడవి జంతువుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ విస్తీర్ణం, సందర్శకుల రిజిస్టర్, వనవిజ్ఞాన కేంద్రం గురించి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా వాటికి కావాల్సిన ఆహారం, ఇతర సదుపాయాలు, ఎలాంటి హాని జరగకుండా చూసుకోవాలని ఫారెస్టు అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు సమీపంలో ఉన్న గెస్ట్‌హౌజ్‌లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ నారాయణ, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రవణ్‌కుమార్, బీట్ ఆఫీసర్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.

వేసవి కాలం.. కోళ్లు, జీవాలు పదిలం!

● ఎండాకాలంలో వ్యాధులు ప్రబలే ఆవకాశం
● పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలి: పశువైద్యులు

చిన్నకోడూరు, మార్చి 22: రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో కోళ్లు, జీవాలకు పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఎండాకాలంలో కోళ్లు, జీవాల సంరక్షణకు పెంపకందారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

పశువైద్యుల సూచనలు పాటించాలి



కోళ్లు, పశు పెంపకందారులు వేసవిలో వాటి రక్షణకు తప్పకుండా పశువైద్యుల సూచనలు పాటించాలి. ఎండలు మండుతున్నందున కోళ్లఫారాల్లు, పశువుల షెడ్లు చల్లగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలి. వేసవిలో వాటి రక్షణకు గల ఏమైనా సందేహాలంటే పశువైద్యులను సంప్రదించాలి.

- మంజుల, మండల పశువైద్యాధికారిణి, చిన్నకోడూరు

ఫారాల్లో కోళ్ల రక్షణకు ఇలా చేయాలి

అధిక ఉష్ణోగ్రతలతో కోళ్ల బరువు పెరగకుండా ఆగిపోవడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడం తదితర ప్రతికూలతతో పాటు, కొన్ని సందర్భాల్లో కోళ్లు చనిపోయే అవకాశం ఉంటుంది.

● కోళ్లఫారాల షెడ్‌లపై తుంగ లేదా వరిగడ్డి పరచి స్ప్రింక్లర్ల ద్వారా నీటిని చల్లుతూ ఉండాలి. షెడ్‌లలో ఫాగర్లను ఏర్పాటు చేసుకోని, ఉష్ణోగ్రతలు పెరగకుండా చూసుకోవాలి.
● ప్లాస్టిక్, ఇనుప డబ్బాల్లో కోళ్లకు తాగునీటిని అందుబాటులో ఉంచితే అవి వేడెక్కుతాయి. డబ్బాలను తరచూ మార్చుతూ ఉండాలి. కోళ్లలో రాణిఖెట్ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున నివారణకు టీకాలు వేయించాలి.

జీవాలను ఉదయం, సాయంత్రం వేళలో మేతకు తీసుకెళ్లాలి

గొర్రెలు, మేకలను ఉదయం, సాయంత్రం వేళలో మేతకు తీసుకెళ్లాలి. మధ్యాహ్నం వేళలో షెడ్‌లలో లేదా చెట్ల నీడన ఉంచాలి. జీవాలను తోలే



షెడ్‌లలో వేడి పెరగకుండా ఉండేందుకు షెడ్‌లపై వరిగడ్డి, తుంగ, తాటి ఆకులు కప్పాలి. వేసవికాలంలో జీవాలకు గోమార్లు, పిడుదుల ద్వారా ప్రోటోజోవన్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. మశూచి నివారణకు టీకాలు వేయించాలి. మురుగు నీటిని తాగినప్పుడు పారుడు వంటి జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున నట్టల నివారణ మందులు వేయించాలి. జీవాలకు చల్లని తాగు నీటిని, సరైన మేతను అందుబాటులో ఉంచాలి.

మారుతున్న పద్ధతులకనుగుణంగా పంటలు సాగు చేయాలి: ఏడీఏ


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ నూతన్‌ప్రసాద్

కల్హేర్, మార్చి 22: రైతులు వ్యవసాయంలో ఎప్పటికప్పుడు మారుతున్న పద్ధతులకు అనుగుణంగా పంటలు వేయాలని, ఇందు కోసం వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని నారాయణఖేడ్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు(ఏడీఏ) నూతన్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని క్రిష్ణాపూర్ రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. రైతులు సాగు సమయంలో చేసే కొన్ని పొరపాట్ల వల్ల భూములు సారవంతాన్ని కోల్పోతున్నాయన్నారు. వరి కొయ్యలను కాలబెట్టడం మూలంగా వాతావరణ కాలుష్యం పెరిగిపోయి భూమి పొరల్లో ఉండే జీవరాశులు అంతరించిపోతున్నాయన్నారు. ఈ కారణంగా భూమి పొరలు మార్పుకోవడం లాంటి మార్పులు సంభవిస్తాయని ఏడీఏ వివరించారు. అందువల్ల వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోనే రోటవేటర్ ద్వారా కలియదున్నాలని సూచించారు. రైతులు యూరియా, పురుగుమందుల వాడకంలో తగిన పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ సూచించారు. నేడు జల దినోత్సవం ఉన్నందున ప్రతి ఒక్కరూ నీటి పొదుపు పాటించాలని, భూగర్భ జలాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం క్రిష్ణాపూర్ శివారులోని వరి పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జడ్పీ కోప్షన్ సభ్యుడు ఎండీ అలీ, ఏఈవో క్రిష్ణవేణి, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

పందుల పెంపకందారులకు నోటీసులు

నారాయణఖేడ్, మార్చి 22: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పందుల పెంపకందారులకు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. మున్సిపల్ పరిధిలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వారం రోజుల్లో వాటిని జనసంచారం లేని ప్రాంతాలకు తరలించాలని నోటీసులో పేర్కొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలి: డీఆర్వో


సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో

సంగారెడ్డి రూరల్, మార్చి 22: పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్వో పద్మజారాణి సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వివిధ పార్టీల ప్రజాప్రతినిధులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఈ నెల 16 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రచారాలు, సభలు, సమావేశాలు, వాహనాల అనుమతులు, బహిరంగ సభలకు సంబంధించిన అనుమతులన్నీ సువిధ యాప్‌లో పొందాలన్నారు. ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడ వద్దని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులకు తలెత్తకుండా పూర్తిస్థాయిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించనున్నట్టు వెల్లడించారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలపాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించినట్టు సమాచారం ఉంటే ఫొటోలు, వీడియోలను ఈసీఐ కల్పించిన సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చుల వివరాల కోసం కొత్త బ్యాంకు ఖాతాను తెరవాలని, బ్యాంకుఖాతా ద్వారా జరిగిన జమ, ఉపసంహరణలు, నగదు లావాదేవీలు ఖర్చుల రసీదుల వివరాలను పూర్తిగా నమోదు చేయాలని సూచించారు.

రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోని సహాయ ఎన్నికల పరిశీలకులు షాడో రిజిష్టర్‌లో నమోదు చేస్తున్న లెక్కలతో సరిచూసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో పరమేశం, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాషా, తారసింగ్, అడివయ్య, రాములు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్


జహీరాబాద్‌లో కేంద్రబలగాలతో నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి విగ్రహం నుంచి బస్టాండ్ వరకు పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రజలకు శాంతిభద్రతలపై భరోసా కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్టు చెప్పారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలు, అధికారులు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. ఫ్లాగ్‌మార్చ్‌లో సీఐ రాజబోయిన రవి, ఎస్‌ఐలు లక్ష్మారెడ్డి, ప్రసాదరావు, నరేష్, క్రిష్ణ, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

రెడ్డిపల్లిలో కేంద్ర బలగాల కవాతు

అల్లాదుర్గం, మార్చి 22: శాంతి భద్రతల పట్ల ప్రజలకు భరోసా కల్పించే ఉద్దేశంతోనే కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని అల్లాదుర్గం సీఐ రేణుక పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో సీఎస్ఎఫ్ బలగాలతో కలిసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్.ఐ ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్ మహిళకు 'నమో డ్రోన్ దీదీ'


డ్రోన్‌ను ప్రారంభించి రైతును సన్మానిస్తున్న గ్రామస్థులు

తూప్రాన్, మార్చి 22: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామ మహిళా రైతు పిట్ల వరలక్ష్మికి కేంద్ర ప్రభుత్వ నమో డ్రోన్ దీదీ పథకం అందజేశారు. రూ.9లక్షల విలువైన డ్రోన్‌ను గ్రోమోర్ కోరమండల్ కంపెనీ సౌజన్యంతో కంపెనీ ప్రతినిధులు ఉచితంగా అందజేశారు. గురువారం మల్కాపూర్‌లో డ్రోన్‌కు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా రైతు వరలక్ష్మిని మాజీ ఉపసర్పంచ్, రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ ఆంజనేయులుగౌడ్, మాజీ సర్పంచు స్వామి ఘనంగా సన్మానించారు. డ్రోన్ యంత్రం వినియోగంపై వరలక్ష్మి 20రోజుల పాటు శిక్షణ పొందారు.

'సెయింట్ ఆంథోనీస్'లో అచీవ్‌మెంట్ అవార్డులు


అవార్డులు అందుకున్న విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, మార్చి 22: సంగారెడ్డి శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో అచీవ్‌మెంట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 1 తరగతి నుంచి 4 వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న జనరల్ విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. చదువు, ఆటల పోటీలు, క్రమశిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైన వాటిలో చురుగ్గా పాల్గొని ప్రతిభ కనబర్చినందుకుగాను పాఠశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి,ఉపాధ్యాయులు ఉన్నారు.

సురేష్ షెట్కార్ గెలుపు కోసం కృషి చేయాలి

- కాంగ్రెస్‌మైనార్టీ విభాగం జిల్లా నాయకుడు ముంతాజ్



నారాయణఖేడ్, మార్చి 22 : జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం నుంచి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ విజయం కోసం అన్ని వర్గాలవారు కలిసి పని చేయా లని మైనార్టీ విభాగం జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ ముంతాజ్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సురేష్ షెట్కార్ ఎమ్మెల్యేగా, ఎంపీగా ఈ ప్రాంతం అభివృద్ధి కోసం ఎంతగానో పాటు పడ్డాడన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం నుంచి వచ్చిన సురేష్ షెట్కార్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌సభ్యుడిగా కృషి చేశాడన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సురేష్ షెట్కార్‌ను గెలిపిస్తే, స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సురేష్ షెట్కార్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు.

'వరద నీటికి అడ్డుకట్ట'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొండాపూర్, మార్చి 22: 'వరద నీటికి అడ్డుకట్ట' కు సంబంధించి ఈ నెల 22వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురిత మైన కథనానికి పొల్యూషన్ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎస్‌జీ, యూబీ పరిశ్రమల పరిధిలో కలుషితం అవుతున్న స్థలాలను శుక్రవారం పరిశీలించి నీటిని సేకరించి ల్యాబ్ టెస్టుకు పంపుతున్నట్లు పీసీబీ ఏఈ శ్రవణ్ తెలిపారు. సేకరించిన నీటి శాంపిల్ ల్యాబ్ రిపోర్టు రాగానే నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ్ పక్వాడ


హరిదాస్‌పూర్ అంగన్‌వాడీలో చిన్నారులకు అక్షరాభ్యాసం

కొండాపూర్, మార్చి22: హరిదాస్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రం లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు తల్లులచే అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు చేశారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ శ్యామల, గర్భిణులు,బాలింతలు ఉన్నారు.

- **తూప్రాన్:** తూప్రాన్ పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రం- 3లో శుక్రవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆంజయ్య హాజరయ్యారు. కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి, పోషకాలను తయారు చేసి ప్రదర్శించారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేయొద్దు

కొండాపూర్, మార్చి 22: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలోనే మెడికల్ కిట్లు, టెంట్లు, మంచినీరు అందుబాటులో ఉంచాలని, బకాయిలను 15రోజుల్లో చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం మండల తేర్పోల్, చెర్లగోపులారం ఉపాధి కూలీల పని ప్రదేశంలోకి ఆ సంఘం వెళ్లి సమస్యలపై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పనిని నిర్వీర్యం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజయరావు, రాములు, బాలరాజు, రాజుగౌడ్, సాయి, జానయ్య, రత్నమ్మ, అనిత,శామమ్మ,పుష్పమ్మ తదితరులు ఉన్నారు.

సీఐటీయూతోనే కార్మిక సమస్యల పరిష్కారం

జిన్నారం, మార్చి 22: సీఐటీయూతోనే కార్మికుల సమస్యలకు పరిష్కారం జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు మల్లేశం అన్నారు. శుక్రవారం కాజీపల్లి టీబీడీసీ పరిశ్రమ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు. త్వరలో జరిగే వేతన ఒప్పందంలో కార్మికులకు మెరుగైన ఒప్పందం అమలు చేస్తామన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసి..

జహీరాబాద్, మార్చి 22: జహీరాబాద్ ఎంపీపీ గిరిధర్‌రెడ్డిని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఫిలిం కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కకు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి వేం నరేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు చెప్పారు. తనకు పదవిరావడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ఆయన వెంట జడ్చర్ల, వనపర్తి ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మేఘారెడ్డి పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో ఆకస్మిక తనిఖీ

కొల్చారం, మార్చి 22: మండల కేంద్రంలో ఉన్న బీసీ హాస్టల్‌ను అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి నాగరాజుగౌడ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు వేళకు సరిపోయినంత అన్నం పెట్టకపోవడంతో పాటు రుచిగా లేక తినలేకపోతున్నామని విద్యార్థులు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి దృష్టికి తెచ్చారు. దాంతో కొల్చారం హాస్టల్‌లో పనిచేస్తున్న వంటమనిషిని కౌడిపల్లికి హాస్టల్‌కు డిప్యుటేషన్ వేసి, అక్కడ పనిచేస్తున్న వంటమనిషిని కొల్చారానికి రప్పించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులను తమ సొంత పిల్లలలాగ చూసుకోవాలని వార్డెన్ భానుసింగ్‌కు సూచించారు.

వల్లభాపూర్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం

చేగుంట, మార్చి 22: చేగుంట మండలం వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెతుకు పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సమత కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

మహనీయుల జయంతి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

సంగారెడ్డి రూరల్, మార్చి 22: డా. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 5న సంగారెడ్డిలో ర్యాలీ నిర్వహించనున్నట్లు బాబు జగ్జీవన్‌రామ్ సమతా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బంగారు కృష్ణ, వేణుగోపాల్‌లు తెలిపారు. మహనీయుల జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని సంగారెడ్డిలోని ఐబీలో శుక్రవారం ఆవిష్కరించారు.

వేంకటేశ్వరాలయంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



శ్రీవేంకటేశ్వరాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో యంత్రాన్ని ప్రతిష్ఠిస్తున్న మాధవానందసరస్వతి స్వామి

అల్లాదుర్గం, మార్చి 22: మండలకేంద్రంలో శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. గురుమదనానంద పీఠాధిపతి మాధవానందసరస్వతి స్వామి పర్యవేక్షణలో నిర్వహించిన వేడుకలను తిలకించేందుకు ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. మూడురోజులుగా కొనసాగుతున్న నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పురోహితుడు శిలాంకోట ప్రవీణ్‌శర్మ పూజలు నిర్వహించగా పలువురు ప్రముఖులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఆవాహిత దేవతాపూజ, మూలమంత్ర హవనం, ధ్వజ సంస్కారం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మాధవానంద సరస్వతి స్వామి చేతులు మీదుగా శ్రీదేవి భూదేవి సమేతుడైన వేంకటేశ్వర స్వామికి వెండి ఆభరణాలను సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు భక్తులకు మహా అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ తో పాటు జాగృతి రాష్ట్ర నాయకులు మఠం భిక్షపతి, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్, ఎంపీపీ అనీల్‌కుమార్‌రెడి హాజరయ్యారు. ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనకు టీఎస్ టీపీసీ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం: ఎంపీపీ

- చిలప్‌చెడ్ మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి

చిలప్‌చెడ్, మార్చి 22: అధికారులు ప్రజల సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ వినోదా దుర్గారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వినోదాదుర్గారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో ఆనంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా గత 3 నెలల నుంచి మండలంలో నిర్వహించిన అభివృద్ధి పనుల నివేదికలను ఆయా శాఖల అధికారులు సమావేశంలో ప్రస్తావించారు. మొదట వ్యవసాయ శాఖ తరపున ఏఈవో భూపాల్ తమ శాఖ నివేదికను చదువుతుండగా, వైస్ ఎంపీపీ విశ్వంబర్ కలుగజేసుకుని సర్వసభ్య సమావేశానికి ఏవో ఎప్పుడూ హాజరు కావడంలేదని మండిపడ్డారు. అదేవిధంగా విద్యాశాఖ తరుపున సీఆర్పీ రాజశేఖర్ మాట్లాడుతుండగా సభ్యులు కల్పించుకుని పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయానికి రావడం లేదని, పనితీరు బాగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. కొన్ని గ్రామాల్లో, ముఖ్యంగా తండాల్లో కొందరు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని, వారికి గ్రామాల్లో అవగాహన కల్పించాలని, లేదా కేసులు చేసే అవకాశం ఉన్నదని హెచ్చరించారు. మిషన్ భగీరథ డీఈ కిషన్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నిధులు తక్కువగా ఉన్నందున ఇబ్బందులు ఉన్నాయన్నారు. స్పెషల్ ఆఫీసర్లు కల్పించుకుని పంచాయతీ సిబ్బందికి జీతాలు రాక వారు విధులు నిర్వర్తించడంలేదని తెలిపారు. గ్రామాల్లో దోమల బెడద ఉన్నందున ఆయిల్ బాల్స్ వేయాలని, సాయంత్రం ఫాగ్ కొట్టించాలని సభ్యులు ఎంపీవోను కోరారు సమావేశంలో పీఆర్ఏఈ మధుబాబు, ఏపీవో శ్యాం, ఏపీఎం ప్రేమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, వెటర్నరీ అసిస్టెంట్ సురేష్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మన్‌సాన్‌పల్లిలో ముగిసిన ఎల్లమ్మ జాతర


పూజల్లో మంత్రి దామోదర్ రాజనర్సింహ

మునిపల్లి, మార్చి 22: మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామ శివారులో గల శ్రీ రేణుక ఎల్లమ్మ 7వ వార్షికోత్సవ సందర్భంగా గత మూడురోజులుగా నిర్వహించిన జాతర శుక్రవారం ముగిసింది. ముగింపు ఉత్సవాలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుడు, కాంగ్రెస్ నాయకుడు అంతారం నర్సింహాగౌడ్, కుటుంబ సభ్యులు మంత్రిని సన్మానించారు. అంతకు ముందు ఆలయంలో అర్చకులు మడుపతి వీరేశంస్వామి, మడుపతి రమేష్ స్వామి అమ్మవారికి సుప్రభాత పూజ, గణపతి పూజ, సర్వదేవత ఆవాహిత పూజ, అభిషేకం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఎంపీటీసీలు పాండు, రాధాబాయి, మాజీ ఎంపీటీసీలు వెంకట్రాములు, మనోహర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీటి పొదుపుపై అవగాహన


కాళ్లకల్ ప్రభుత్వ పాఠశాలలో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మనోహరాబాద్, మార్చి 22: ప్రపంచ మంచినీటి దినోత్సవం సందర్భంగా కాళ్లకాల్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. . పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులకు భూగర్భ జలాల సంరక్షణ గురించి వ్యాస రచన పోటీలు, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇండియన్ టొబాకో కంపెనీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐటీసీ వాష్ ప్రాజెక్ట్ అధికారి విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

నర్సాపూర్, మార్చి 22: ప్రపంచ వాటర్‌డే సందర్భంగా శుక్రవారం బీవీఆర్‌ఐటీ కాలేజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో మండలంలోని రామచంద్రాపురంలో స్థానిక ప్రజలకు నీటిపొదుపు చెట్ల పెంపకంపై అవగాహన కల్పించారు. నీటిని వృథా చేయడం వల్ల కలిగే నష్టాలతో పాటు చెట్లను ఇష్టానుసారంగా నరకడం వల్ల కలిగే అనర్థాలు, వాటిని పెంచడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ కృష్ణారావు, అధ్యాపకులు విజయగౌరి, రూపదేవి, అభయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో దూకి వాచ్‌మన్ ఆత్మహత్య


బాలయ్య(ఫైల్)

కూకట్‌పల్లి, మార్చి 22: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హైదరాబాద్ కూకట్‌పల్లిలో చోటు చేసుకొంది. శుక్రవారం కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం హస్తల్‌పూర్ గ్రామానికి చెందిన జానపాటి బాలయ్య(28) కూకట్‌పల్లిలోని శాతవాహననగర్‌లో నివాసముంటూ వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా బాలయ్య ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నెల 21న మెడికల్ షాపుకు వెళ్తున్నానని చెప్పి కాలనీకి సమీపంలోని భీమునికుంట వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచే బంధువులకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకొంటున్నానని చెప్పి కుంటలో దూకాడు. శుక్రవారం ఉదయం బాలయ్య మృతదేహం కుంటలో తేలడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత.. కేసు నమోదు

పాపన్నపేట, మార్చి 22: ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులో నుంచి ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అబ్లాపూర్ గ్రామ చెరువులో నుంచి గురువారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి కొత్తపల్లి శివారులో రెండు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామానికి చెందిన రాజబోయిన దుర్గేష్, శెగ్గరి రాజుగౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గన్‌తో బెదిరించి మేకలు ఎత్తుకెళ్లేందుకు యత్నం

- దుండగులను పట్టుకుని పోలీసులకు అప్పగింత

నర్సాపూర్, మార్చి 22: నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మేకలను ఎత్తుకెళ్లేందుకు యత్నించారు. ఇది గమనించిన స్థానికులు వారిని పట్టుకునేందుకు యత్నించగా దుండగులు గన్‌తో బెదిరించి పారిపోయేందుకు ప్రయత్నం చేశారు. అయినా గ్రామస్థులు వారిని వెంటాడి నర్సాపూర్ సమీపంలో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వారిని పట్టుకునే యత్నంలో శివ అనే యువకుడు కింద పడటంతో చేతికి గాయమైంది. కాగా దుండగులు తెచ్చిన గన్ అసలా.. నకిలీదా అనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు.

మట్టి అక్రమ తరలింపు.. విజిలెన్స్ టీం ఏర్పాటు

మనోహరాబాద్, మార్చి 22: మండల కేంద్రంలోని మట్టి మాఫియా ఆటకట్టించేందుకు తహసీల్దార్ చంద్రశేఖర్ శుక్రవారం ఐలా పారిశ్రామిక ప్రాంతంలో కూచారం, కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, గ్రామాలకు తుల్జానాయక్‌ను, కొండాపూర్, రంగాయపల్లి గ్రామాలకు వీరాస్వామిని విజిలెన్స్ టీంలను నియమించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా పారిశ్రామిక ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి తరలిస్తే కేసులు తప్పవన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

హత్నూర, మార్చి 22: వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శంకర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి సూచించారు. శుక్రవారం హత్నూర ఎంపీపీ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారమయ్యేలా చూడాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఎంపీవో సువర్ణ, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుంటాం


నర్సాపూర్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

నర్సాపూర్/శివ్వంపేట/ హత్నూర, మార్చి 22: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కలిసికట్టుగా పనిచేస్తామని బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం వేర్వేరు చోట్ల నిర్వహించిన విలేకరుల సమావేశాల్లో స్పష్టం చేశారు. నర్సాపూర్ విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌తో పాటు వైస్‌చైర్మన్ నయీమోద్దీన్, నాయకులు నయీమోద్దిన్, కౌన్సిలర్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు. శివ్వంపేటలో నిర్వహించిన సమావేశంలోఎంపీపీ హరికృష్ణ, జడ్పీటీసీ మహేష్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు రమణాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దౌల్తాబాద్ విలేకరుల సమావేశంలో ఎంపీపీ అధ్యక్షుడు వావిలాల నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న రఘునందన్‌రావు

జిన్నారం, మార్చి 22: పార్లమెంటు ఎన్నికల్లోగెలుపే లక్ష్యంగా గ్రామ, బూత్ స్థాయి నుంచి పార్టీ కార్యకర్తలు విజయం కోసం కృషి చేయాలని పార్టీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం జిన్నారంలో నిర్వహించిన బీజేపీ మండల కార్యకర్తల సమావేశంలో మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావు పాల్గొన్నారు. గ్రామ, బూత్ స్థాయి నుంచి పటిష్ఠమైన ప్రణాళికతో ఎన్నికల్లో విజయం కోసం సమష్టిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు ఆదెల్లి రవీందర్, ప్రతాప్‌రెడ్డి, నర్సింగరావు, జగన్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేష్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వానికి బ్రహ్మరథం పడుతున్న ప్రజలు


మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్

అల్లాదుర్గం, మార్చి 22: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజలు మోదీ నాయకత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని, రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యం అని బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం అల్లాదుర్గంలోనీ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకరల సమావేశానికి హజరై మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు యాదగిరి, జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

వలసల నివారణ కోసమే ఉపాధిహామీ పథకం

కంగ్టి, మార్చి 22: వలసలను నిర్మూలించి, స్థానికంగానే ఉపాధి అవకాశాలను మెరుగు పర్చేందు కోసమే ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తుందని జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి బాలరాజు పేర్కొన్నారు. శుక్రవారం కంగ్టిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను, నర్సరీలను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడీ రాజు, ప్లాంట్ మేనేజర్ మనికుమార్, ఎంపీడీవో సత్తయ్య, టీఏ.రవీందర్‌రెడ్డి, కార్యదరిసుభాష్, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

సంగారెడ్డి రూరల్, మార్చి 22: మనువాదులు చేతుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని కుల వివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) అశోక్ అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, రాజు, మల్లేశం, దాస్, దత్తు, గంగారం, చరణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'నల్లా బిల్లులు తీసేయాలి'

తూప్రాన్, మార్చి 22: తూప్రాన్ పట్టణంలో నల్లా బిల్లులు భారంగా తయారయ్యాయని, వాటిని తొలగించాలని బ్రాహ్మణపల్లి (10వార్డు) ప్రజలు వినతి చేశారు. శుక్రవారం నూతన చైర్మన్ జ్యోతికృష్ణను సన్మానించి, వినతి పత్రం అందజేశారు. ప్రతినెల 100 చెల్లింపు చేయడం భారంగా తయారైందన్నారు.

తూప్రాన్ పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా జానకీరాంగౌడ్

తూప్రాన్, మార్చి 21: తూప్రాన్ పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా తూప్రాన్‌కు చెందిన భూమన్నగారి జానకిరాంగౌడ్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఓబీసీ సభ్యులు బండారు దుర్గరాజ్‌యాదవ్, మున్సిపల్ మాజీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.